## క్లుప్తంగా

### ఘనంగా పున్నమి చవితి వేడుకలు



పున్నమి చవితికి పుట్టలో మొక్కుతున్న భక్తులు

పెద్దాపురం: స్థానిక అర్బన్, రూరల్ ప్రాంతాల్లో పున్నమి చవితి వేడుకలు మంగళవారం నిర్వహించారు. వేకువ జామునే కుటుంబ సమేతంగా సమీపంలో పంట పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. నూపప్పు, బెల్లంతో తయారు చేసిన చిమ్మిడిని, బుర్రగుంజ తదితర వాటిని నైవేద్యంగా సమర్పించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

### కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

పెద్దాపురం: విశాఖ పట్టణంలో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందుతున్న సహస్ర, యోగేష్‌లు కాటా, కుంటే విభాగాల్లో బంగారు పతాకాలు సాధించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణకుమార్ తదితరులు అభినందించారు.

### మరుగుదొడ్ల వినియోగంతో వ్యాధులు దూరం



ఉండూరులో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ హిమామహేశ్వరీ

సామర్లకోట: పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించాలని ఎంపీడీఓ కె.హిమామహేశ్వరీ అన్నారు. ప్రపంచ టాయ్‌లెట్ల డేను పురస్కరించుకొని మండల పరిధిలో ఉండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వలన కలిగే అనార్థాలను వివరించారు. దీనిని దీష్టిలో ఉంచుకొని విద్యార్థులు తమ తమ తల్లిదండ్రులకు బహిరంగ విసర్జన నిర్మూలనపై అవగాహన పెంచాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బైరవమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సినిమాలు



పిఠాపురం

| | |
|---|---|
| వెంకటేశ్వర థియేటర్ | క |
| సత్య | కొంగువ |
| అన్నపూర్ణ | అమరన్ |
| పూర్ణ | మట్కా |
| ఉప్పాడ | |
| శ్రీనివాస థియేటర్ | క |

# విజ్ఞానం.. వినోదం

- ఘనంగా జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు
- విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ
- సృజనాత్మకత వెలికి తీసేలా తర్ఫీదు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



ఉప్పాడ గ్రంథాలయంలో వారోత్సవాలకు హాజరైన విద్యార్థులు

కొత్తపల్లి: విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. గ్రంథాలయాల్లో ఈ నెల 14న ప్రారంభమైన వారోత్సవాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 3000 మంది విద్యార్థులు వారోత్సవాల్లో పాల్గొంటున్నారు. కాకినాడ జిల్లాలోని 46 గ్రంథాలయాల్లో సుమారు 2000 మంది విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాలకు హాజరవుతున్నారు.

**నియోజకవర్గంలో...**

పిఠాపురం నియోజకవర్గంలో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, ఉప్పాడలో గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో కొత్తపల్లి మినహా మిగిలిన గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వం, జానపద గేయాలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.



విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సృజనాత్మకత వెలికి తీసేలా...**

చిన్నారుల్లోని సృజనాత్మకత వెలికి తీసేలా గ్రంథాలయ శాఖ ప్రత్యేక పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్నారు. బాలబాలికలు పుస్తక పఠనం వైపు మళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రంథాలయల్లోనే ఉంటున్నారు. విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, భావవ్యక్తీకరణ, ఆంగ్ల భాషపై పట్టుసాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. పుస్తక పఠనం, కథలు, చదరంగంతో పాటు వినోదం, విజ్ఞానం, కలబోతగా పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆకట్టుకునేలా కథలు చెప్పడం, నీతి కథలు, ఆదర్శవంతమైన ప్రవర్తన, భావ వ్యక్తీకరణ వంటి అంశాలపై శిక్షకులతో తర్ఫీదు ఇస్తున్నారు.

### చిత్రలేఖనంపై ఆసక్తి



నాకు చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. ఖాళీ సమయాల్లో బొమ్మలు వేస్తుంటాను. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మరిన్ని మెళకువలు నేర్చుకుంటున్నాను. శిక్షణను సద్వినియోగం చేసుకుని కొత్త అంశాలను నేర్చుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది.

– మమతా గ్రేస్, 6వ తరగతి, ఉప్పాడ

### కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను



గ్రంథాలయ వారోత్సవాల్లో నూతన విషయాలు నేర్చుకుంటున్నాను. ముఖ్యంగా స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం వంటి వాటిపై ప్రతేక శిక్షణ పొందేందుకు వస్తున్నాను. నాకు ఈ శిక్షణ ఎంతో గానో ఉపయోగపడుతోంది. అతిథులు కొత్త విషయాలు చెబుతున్నారు. పోటీలు నిర్వహించి మా ప్రతిభను వెలికి తీస్తున్నారు.

– అక్షయ రాణి , 5తరగతి, ఉప్పాడ

### తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల వారోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 60 గ్రంథాలయాల్లో వారోత్సావాలు నిర్వహిస్తున్నాం. సుమరుగా 3000 మంది విద్యార్థులు ప్రతిరోజూ వస్తున్నారు. పుస్తకాల ప్రదర్శన, గ్రంథాలయాలపై అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను ప్రోతహించి గ్రంథాలయాలకు పంపించాలి.

– వి.సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

### పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు



గ్రంథాలయ వారోత్సవాలకు వచ్చేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రెట్టింపు మంది విద్యార్థులు వస్తున్నారు. ప్రతి రోజు 40 నుంచి 50 మంది వరకు విద్యార్థులు హాజరవుతున్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తున్నాం.

– టి.నళినీ ప్రియ, గ్రంథాలయాధికారి, ఉప్పాడ

## పీసా చట్టంపై నేడు సమీక్ష

సామర్లకోట: గిరిజన ప్రాంతాలకు చెందిన పంచాయతీలు కలిగిన జిల్లాలోని అధికారులకు పీసా చట్టంపై బుధవారం నుంచి రెండు రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ)లో అవగాహన సమీక్ష ఉంటుందని ఈటీసీ మేనేజరు పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలోని అధికారులతో చర్చ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలల్లో సంప్రదాయాలు, ఆచారాలు, సాంస్కృతి గుర్తింపు, కమ్యూనిటీ వనరులు, సంప్రదాయ పద్ధతిలో వివాదాల పరిష్కారం, మాదకద్రవ్యాల నిషేధం, సామాజిక ఆర్థిక అభివృద్ధిక సంబంధించిన ప్రణాళికలు, ప్రాజెక్టుల ఆమోదంపై గ్రూప్ డిస్కషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమీక్షను ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ప్రారంభిస్తారని చెప్పారు.

## పవర ఆస్పత్రి వద్ద ధర్నా




పవర ఆస్పత్రి వద్ద ధర్నా చేసిన రోగి బంధువులు

సామర్లకోట: పవర గ్రామంలోని కార్పొరేట్ ఆస్పత్రి వద్ద ఏలేశ్వరానికి చెందిన రోగి బంధువులు మంగళవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. నల్లమటి చంటమ్మను వైద్యం నిమిత్తం నెల 11న ఆస్పత్రికి తీసుకురాగా, 14వ తేదీ వరకు పట్టించుకోలేదన్నారు. దీని కారణంగా ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని ఆరోపిస్తూ ఆస్పత్రి గేటు వద్ద ఏలేశ్వరానికి చెందిన రోగి బంధువులు బైఠాయించి ధర్నా చేశారు. రోగి వైద్యంపై నిర్లక్ష్యం వహించినందుకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు పైపులైన్ లీకు నివారణకు చర్యలు



సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం వద్ద లీకులను నివారిస్తున్న సిబ్బంది

సామర్లకోట: పట్టణ పరిధిలో విస్తరణ శిక్షణ కేంద్రం సమీపంలో తాగునీటి పైపులైను లీకులను నివారించడానికి మంగళవారం చర్యలు చేపట్టారు. సుమారు రెండు నెలలుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎదురుగా ఉన్న పెద్దాపురం తాగునీటి పైపులైన్ లీకవుతోంది. దీనిపై అనేక పర్యాయాలు పత్రికల్లో కథనాలు రావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. సామర్లకోట–కాకినాడ రోడ్డులోని సాంబమూర్తి రిజర్వాయర్ నుంచి పెద్దాపురం వాటర్ ట్యాంకులకు తాగునీరు వెళుతుంది. ఈ మేరకు రిజర్వాయర్ నుంచి ఐదు తూములు మీదుగా బ్రౌన్‌పేట, సీబీఎం సెంటర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు నుంచి పెద్దాపురం వరకూ పైపులైన్ వెళుతుంది. ఈ పైపులైన్ ఏర్పాటు చేసి సుమారు 30 ఏళ్లు దాటి పోవడంతో తరచూ అనేక ప్రదేశాలల్లో లీకులు ఏర్పడుతున్నాయి. దీనిలో భాగం గా విస్తరణ శిక్షణ కేంద్రం వద్ద తరుచూ లీకులు ఏర్పడటంతో శాశ్వత లీకుల నివారణకు మంగళవారం పెద్దాపురం మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు.

## ఉలిమేశ్వరంలో ‘పొలం పిలుస్తోంది’



ఉలిమేశ్వరం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ

పెద్దాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియెగం చేసుకోవాలని పెద్దాపురం ఏడీఏ ఎస్.దైవకుమార్ అన్నారు. ఉలిమేశ్వరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఏడీఏ దైవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పీపీసీ సిబ్బందిని నియమించామన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ పశు గణన సర్వే చేస్తున్నామన్నారు. ఉద్యాన శాఖాధికారి సుజాత, ఏఈఓలు ప్రసాద్, రాగ స్రవంతి వ్యవసాయ సహాయకులు సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

## నేరాల అదుపునకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి

- డీఎస్పీ శ్రీహరిరాజు



ఆటో, టాక్సీ డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

సామర్లకోట: నేరాల అదుపు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ కె.శ్రీహరిరాజు అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో టాక్సీ, ఆటో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటోలు, టాక్సీల్లో ప్రయాణం చేసే సమయంలో ప్రయాణికులు బ్యాగ్‌లు, సామగ్రి మరచిపోయే అవకాశాలు ఉంటాయని, అలాంటి సమయంలో పోలీసుల సహకారంతో ప్రయాణికులను గుర్తించి వారికి మరచిపోయిన వస్తువులు అందించేలా చేయడం ద్వారా సామర్లకోట ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు అంటే మంచి పేరు వస్తుందని చెప్పారు. అద్దె వాహనాల్లో నేరస్తులు ప్రయాణం చేసే అవకాశాలు ఉంటాయని, రాత్రి సమయంలో ఇటువంటి వారిపై డ్రైవర్లు నిఘా ఉంచాలన్నారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపై ఆటోలు, కార్లు పార్కింగ్ చేయకుండా ఎవరికి వారే తగ్గ శ్రద్ధ చూపాలన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించడం నేరమని హెచ్చరించారు. డ్రైవర్లు తప్పని సరిగా ఖాకీ యూనిఫాం, రికార్డులు ఉంచుకోవాలని సూచించారు. ప్రతి సెంటర్‌లోను, షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఎ.కృష్ణ భగవాన్, అంకబాబు, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, క్రైమ్ హెచ్‌సీ గంగిరెడ్డి బలరాం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నాయకుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలి

- గ్రంథాలయ వారోత్సవాల్లో రత్నమణి



మహిళా దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: జాతీయ నాయకుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా విద్యర్థుల జీవితాలకు మంచి బాట వేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని గ్రంథాలయాధికారి బందిల రత్నమణి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రాజరాజేశ్వరీలో కలిసి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. గ్రంథాలయానికి ప్రతి రోజు వచ్చి పుస్తకాలు, న్యూస్ పేపర్లు చదవడం వల్ల అనేక విషయాలు తెలియడంతో పాటు విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో గ్రంథాలయ ఒక దేవాలయం, సీనియర్ విభాగంలో చదవడం అంటే మాకిష్టం అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు సీనియర్ ఉపాధ్యాయులు ఎండీవీ ప్రసాద్, టీవీవీ సత్యనారాయణ, పి.బ్రహ్మానందం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బుధవారంతో గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయని, ఇప్పటి వరకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి రత్నమణి తెలిపారు.



సామర్లకోటలో ఇందిరా గాంధీచిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు

**గ్రంథాలయ వారోత్సవాల్లో మహిళా దినోత్సవం**

పెద్దాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి పాలంగి నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీలలిత, ఉపాధ్యాయులు జయశ్రీ, జ్యోతిర్మయి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోష్యుల కష్ణబాబు, సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని స్వామివారు



పంచారామ క్షేత్రంలోని అమ్మవారు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు



విశేష అలంకారంలో రామలింగేశ్వర స్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక మాసం స్వామి వారి ఆరుద్ర నక్షత్రం కావడంతో తెల్లవారు జామున ఆలయంలో గోపూజ చేసి స్వామివారికి అభిషేకాలు, పూజలు ప్రారంభించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అమ్మవార్లకు, ఆలయంలోని ఉప ఆలయాలో ను ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి, అళ్లకి రాజ్ గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం స్వీకరించారు.

### ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలోని జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో మంగళవారం రాత్రి స్వామివారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని లక్షపతి పూజలు చేసుకున్న వారికి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఎంతగానో ఆకట్టుకుంది. లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తుల కోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. పూజలు అనంతరం, స్వామి తెప్పోత్సవం ముగిసిన తరువాత జ్యోతిర్లింగార్చనకు దీపాలు వెలిగించారు.

**ముగిసిన సప్తాహ మహాయజ్ఞం**

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహ మహాయజ్ఞం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహాన్నదానం నిర్వహించారు. ఆలయ సేవా సభ్యులు అందజేసిన 1100 కేజీల అన్నంతో అర్చకులు స్వామి వారికి మహా నివేదన సమర్పించారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. మంగళవారం సంకటహర చతుర్థి, ప్రాంతీయ నాగుల చవితి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు స్వామివారికి భక్తులు సమర్పించిన రజత ఆభరణాలతో విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి**

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని స్వామి వారిని మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్తిక మాసం, స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా లక్ష బిల్వార్చన చేశారు.

### కుక్కుటేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కుక్కుటేశ్వరస్వామివారు

పిఠాపురం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పండితులు స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్ర పుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు.

## కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తరలించాలి

- జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా
- వేట్లపాలెంలో కొనుగోలు కేంద్రం పరిశీలన



వేట్లపాలెంలో రైతు సేవా కేంద్రాను పరిశీలించిన జేసీ రాహుల్‌మీనా

సామర్లకోట: రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర ను పొందాలని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్‌మీనా అన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని వేట్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన జిల్లా పైర సరపరాల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భగా జేసీ మాట్లాడుతూ కింటాల్ కామన్ రకానికి రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320గా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే ముందు రైతులు ఖచ్చితంగా ధాన్యంలో తేమ ప్రమాణాలు రైతే సేవా కేంద్రాల్లో పరిశీలించుకోవాలని, తరువాతే ధాన్యం సేకరణ కేంద్రానికి అమ్ముకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన రాండమ్ మిల్ జనరేషన్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు తరలించుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా వాట్సాప్‌లో ధాన్యం కొనుగోలు కూపన్ కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు రైతులకు కల్పించామన్నారు. దీని కోసం రైతులు తమ మొబైల్ నుంచి 73373 59375 నంబర్ వాట్సాప్‌లో హెచ్‌ఐని మెసెజ్ చేస్తే రైతు ఎంచుకున్న సమయానికి కూపన్ షెడ్యూల్ చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసకోవాలన్నారు. జిల్లా పౌర సరఫరాల మేనేజరు ఎండీ నాయక్ మాట్లాడుతూ ధాన్యం ఆరబోసిన తరువాత రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గ్రామ వ్యయసాయ సహాయకులు రైతుల కు అందుబాటులో ఉండి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మండల వ్యవసాయాధికారి ఐ సత్య, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, వీఏఏ షేక్ షనవాజ్, బి.సీలిమ రైతులు పాల్గొన్నారు.